అధికారుల పచ్చపాతం.. స్థానికులకు శాపం

దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా 247వ గంధ మహోత్సవాల్లో అధికారుల పచ్చపాతం స్థానికులకు శాపంగా మారింది. దీంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గంధమహోత్సవాలకు హాజరయ్యేందుకు కసుమూరు పంచాయతీ పరిధిలో అన్ని కాలనీల్లోని పెద్దలకు పాసులు పంపిణీ చేయడం ఏళ్లుగా కొనసాగుతుంది. అయితే ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవాలకు పాసుల పంపిణీలో స్థానికులకు అన్యాయం జరిగింది.

కసుమూరు గంధోత్సవంలో పాసుల దందా

- స్థానికులకు రావాల్సిన పాసులు పక్కదారి
- అధికార పార్టీ నాయకులకే పంపిణీ
- స్థానిక ప్రజాప్రతినిధులకు దక్కని గౌరవం



గంధం దర్గాకు చేరే సమయంలో ముఖద్వారం వద్ద భక్తుల రద్దీ

వెంకటాచలం: గంధ మహోత్సవాలకు సంబంధించి దర్గా ముజావర్లకు, ఫకీర్లకు, పంచాయతీ పరిధిలో అన్ని కాలనీల్లోని పెద్దలకు, ప్రజాప్రతినిధులకు కలిపి ఏటా 300 పాసులు పంపిణీ చేయడం ఆనవాయితీగా కొనసాగుతుంది. చందన్‌మహాల్ నుంచి గుర్రంపై ఊరేగింపుగా దర్గాకు చేరే సమయంలో పాసులు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. అయితే ప్రస్తుత ఉత్సవాలకు సంబంధించి ముజావర్లకు, ఫకీర్లకు, అధికార పార్టీకి చెందిన నాయకులకు మాత్రమే పాసులు పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో వారికి పాసులు పంపిణీ చేయనీకుండా టీడీపీ మైనార్టీ యువ నాయకుడు అధికారులపై ఒత్తిడి తెచ్చాడనే ఆరోపణలు ఉన్నాయి. తాను చెప్పిన వారికే పాసులు ఇవ్వాలని హుకూం జారీ చేయడంతో అధికార పార్టీ నాయకులకు తప్ప ప్రతిపక్ష పార్టీ నాయకులకు, ఇతర గ్రామ పెద్దలకు పాసులు పంపిణీ చేయలేదు. గ్రామానికి చెందిన మండల ఎంపీపీ మందా కవిత, సర్పంచ్ కడివేటి శివ తదితరులకు ఉత్సవాలకు కనీస గౌరవం లేకుండా వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ఒక్కో పాసు రూ.3 వేలకు అమ్మకాలు

గంధ మహోత్సవాలకు సంబంధించి వక్ఫ్‌బోర్డు, పోలీసులు జారీ చేసే పాసులు ఎక్కువ శాతం టీడీపీ మైనార్టీ సెల్ యువ నాయకుడు చెప్పిన వారికే పంపిణీ చేయగా పాసులు పొందిన వ్యక్తులు వాటిని భక్తులకు అమ్మకాలు చేశారు. గంధం దర్గాకు చేరిన సమయంలో దర్గాలోకి వెళ్లేందుకు పాసులు ఉన్న వారినే అనుమతించడంతో భక్తులు లోపలికి వెళ్లే అవకాశం వీలు కలుగలేదు. ఆ సమయంలో పాసులు పొందిన కొందరు వ్యక్తులు భక్తులకు ఒక్కో పాసును రూ.1000 నుంచి రూ.3 వేలకు అమ్ముకున్నారు.

300 మందికి పాసులు జారీ చేశాం

గ్రామ పంచాయతీలో అన్ని కాలనీల వారికి, ముజావర్లకు, ఫకీర్లకు 300 పాసులు జారీ చేశారు. ఈ పాసులను తాము పోలీసులకు అప్పగించాం. పాసుల అమ్మకాలు మా దృష్టికి రాలేదు.

– అస్లాం, దర్గా పర్యవేక్షకుడు

ప్రజాప్రతినిధులకు గౌరవం లేదు

కసుమూరు దర్గా గంధ మహోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేదు. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే పాసులు పంపిణీ చేయడంతో కొందరు వాటిని అమ్ముకున్నారు. ప్రజా ప్రతినిధులకు ఈ ఉత్సవాల్లో ఎలాంటి గౌరవం కల్పించలేదు.

– మందా కవిత, ఎంపీపీ

క్లుప్తంగా

ప్రసన్న పరామర్శ



రమేష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రసన్న

కోవూరు : మండలంలోని పడుగుపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు మోడెం రమేష్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రమేష్‌రెడ్డి సోదరులైన కోటారెడ్డి, ప్రద్యుమ్నరెడ్డి రెండు రోజుల వ్యవధిలో అనారోగ్యం కారణంగా మరణించారు. దీంతో పడుగుపాడులోని ఆయన నివాసానికి ప్రసన్న వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రమణయ్య, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏఈ అనిల్‌కుమార్, సిబ్బంది

మనుబోలు : విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాలు, పరికరాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తు తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకరాదన్నారు. పొలాలకు వేసే ఫెన్సింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ షాక్‌కు గురైన సమయంలో ఆ వ్యక్తిని నేరుగా తాకరాదన్నారు. హీటర్ వాడే వారు ఆఫ్ చేయకుండా నీళ్లను ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ చార్జీల భారం తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఇంజినీర్ నాగార్జున, సిబ్బంది ఉన్నారు.

రౌడీషీటర్‌పై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బోడిగాడితోటకు చెందిన ఆర్ముగం భార్య రైల్లో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకాష్ భార్య సైతం భిక్షాటన చేసేవారు. ఈ క్రమంలో వీరి మధ్య ఇటీవల ఘర్షణ చోటుచేసుకోగా, ఆర్ముగంపై ఆకాష్ చేయిచేసుకున్నారు. ఈ తరుణంలో ఆర్ముగం తన స్నేహితుడైన తడికలబజార్ సెంటర్‌కు చెందిన రౌడీషీటర్ ప్రణయ్‌తో సీసీఎస్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి మాట్లాడసాగారు. ఈ క్రమంలో ఆకాష్, పెంచలయ్య, సాయికుమార్, రాము ఆటోలో అక్కడికి చేరుకొని వారిపై రాళ్లతో దాడి చేశారు. దీంతో వారు పరుగులు తీయగా, నిందితులు వెంబడించి కత్తితో ప్రణయ్‌పై దాడి చేసి పరారయ్యారు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తి ఖాతాలోని నగదును కాజేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఫతేఖాన్‌పేటలోని సకిలంవారి వీధికి చెందిన పురుషోత్తం శ్రీహరినగర్‌లోని ఓ డెవలపర్స్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. అదనంగా డబ్బులు సంపాదించేందుకు వివరాలు పంపాలని ఆయన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో అందులో తన వివరాలను పొందుపర్చారు. కొద్దిసేపటికే అతని బ్యాంక్ ఖాతాలోని రూ.1.45 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. దీంతో సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్‌కు బాధితుడు తక్షణమే ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

పింఛన్ల పంపిణీ నేడు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 54 డివిజన్లలో 46,963 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేసేలా కార్యాచరణను రూపొందించామని కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20,06,19,000 మేర నగదును లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దే అందజేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. పర్యవేక్షణకు 27 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. ప్రక్రియను ఉదయం ఆరు నుంచే ప్రారంభించాలని, పంపిణీ శాతాన్ని ప్రతి గంటకూ తెలియజేయాలని సూచించారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మహిళలు స్వయంశక్తితో ఎదగాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. పట్టణంలోని పార్క్ సెంటర్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాల ద్వారా పొందే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌లో ప్రజలకు తక్కువ ధరకే వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీఓ నర్మద, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం మండల ఎక్సైజ్ సీఐగా కిశోర్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎక్సైజ్ సీఐ యశోధరదేవి గుంటూరుకు బదిలీపై వెళ్లారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మనుబోలు : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. హైవేపై కంటైనర్ లారీలో జరిగిన చోరీపై ఎస్సై రాకేష్‌ను ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, మరో వైపు నిద్ర మత్తు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు విశ్రాంతి ప్రదేశాలను ఏర్పాటు చేసి వసతి కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత టోల్‌ప్లాజాలపై ఉందన్నారు. హైవేపై దొంగతనాలు, నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు సూచించారు. కొందరు యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. వారి వెంట సిబ్బంది మాధవ్, శ్రీనివాసలు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మనుబోలు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

మనుబోలు : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు వారిని అభినందించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు అనూష, హబీబా, సుధీర్, హర్షవర్ధన్‌లు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు శరత్‌బాబు, మల్లికార్జున, రమేష్, నాగరాజు, దిలీప్, మస్తాన్‌వలీ, బాయమ్మ, విజయకుమార్, శారద, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక



కోవూరు : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాల, బాలికల జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక సోమవారం జరిగింది. వచ్చే నెల నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల కోసం 13 మంది బాలికలు, 13 మంది బాలలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శివుని నరసింహారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, విద్యా కమిటీ చైర్‌పర్సన్లు షాహినా, చెంచులక్ష్మి, ఎ.ఝాన్సీరాణి, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి చేజర్ల కృష్ణారెడ్డి, పీడీలు దేవిక, సిరాజ్ అహ్మద్, రమణయ్య, పుల్లమ్మ, రేణుక, అరోర, కల్పనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో మొండి రోగాలు నయం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జగదీశ్వరి

మనుబోలు : ఆయుర్వేద వైద్యంతో ఎంతో కాలంగా బాధిస్తున్న మొండి రోగాలను సైతం నయం చేయవచ్చని మడమనూరు ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు జగదీశ్వరి అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఆయుర్వేదంలో షుగర్, కీళ్లవాతం, థైరాయిడ్, మొలలు తదితర రోగాలకు సైతం మందులు ఉన్నాయన్నారు. ఆయుర్వేద వైద్యం వల్ల ఆలస్యంగా ఫలితాలు వస్తాయన్నారు. అయితే ఈ మందుల వాడకం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ఆయుర్వేద వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తీరంలో స్వచ్ఛత హీ సేవ



తీరంలో చెత్తను శుభ్రం చేస్తున్న మహిళలు



గ్రామస్తులతో ఫౌండేషన్ ప్రతినిధులు

విడవలూరు : మండలంలోని రామతీర్థం తీరంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ కె.యాకోబు మాట్లాడుతూ తీరప్రాంత ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం మత్స్యకార గ్రామాలైన రామలింగాపురం, ఆంజనేయపురం, గౌరీపురంలో స్త్రీ, పురుషులు కలిసి సముద్ర తీర ప్రాంతాలను శుభ్రం చేశారు. వీరితో మెరైన్ సిబ్బంది, సాగర మిత్రలు, గ్రామంలోని పెద్ద కాపులు కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. తీరంలో చెత్త వేయడం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి డి.సుందర్‌రాజు, కె.సహాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఏఈగా శ్రీనివాసులు

పొదలకూరు : పొదలకూరు సబ్‌డివిజన్ ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఏఈగా శ్రీనివాసులు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అన్వేష్ నెల్లూరుకు వెళ్లారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాధ్యతల స్వీకరణ

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా రమేష్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.కసనానాయక్ మనుబోలు మండలానికి బదిలీపై వెళ్లారు. కాగా రమేష్ విడవలూరు మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది.

రేపటి నుంచి ఉపాధి హామీ గ్రామసభలు



మాట్లాడుతున్న రాజమ్మ

మనుబోలు : ఈనెల 2వ తేదీ మహాత్మ గాంధీ జయంతి రోజు నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలను నిర్వహిస్తామని ఆ పథకం ఏపీఎం రాజమ్మ తెలిపారు. మండల కేంద్రమైన మనుబోలులోని తన కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. గ్రామసభల్లో ఏఏ పనులు అవసరమో గ్రామస్తులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆపై వాటిని ఆమోదించి పనులు ప్రారంభిస్తామన్నారు. అధిక సంఖ్యలో కూలీలకు పనులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట టీఏ గుర్రప్ప, ఈసీ సుప్రజ ఉన్నారు.

డిసెంబర్ నాటికి ఇళ్లను పూర్తి చేస్తాం

- ఏఈ భాస్కర్‌రావు



మనుబోలు : డిసెంబర్ ఆఖరులోపు అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు తెలిపారు. మనుబోలు మండల హౌసింగ్ ఏఈగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈగా ఉన్న రవికుమార్ మర్రిపాడు మండలానికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో భాస్కర్‌రావు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో స్లాబ్ లెవెల్లో పూర్తయిన గృహాలను అక్టోబర్ 31లోగా పూర్తి చేస్తామని తెలిపారు. 93 గృహాలు రూఫ్ లెవెల్, 33 గృహాలు లెంటల్ లెవెల్లో ఉన్నాయని, వాటిని కూడా డిసెంబర్ ఆఖరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నరసాపురం విద్యార్థినులు



ప్రతిభ చూపిన విద్యార్థినులతో పాఠశాల సిబ్బంది

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురంలో ఉన్న ఎంవీఆర్‌ఆర్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో వివిధ అథ్లెటిక్స్ పోటీల్లో పి.ఇందు, పి.అమూల్య, పి.జ్యోతి ప్రతిభ చాటారు. దీంతో వీరు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున పాల్గొంటారు. ఈ క్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థినులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శివకృష్ణ



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్

పొదలకూరు : మండల ఇన్‌చార్జి తహసీల్దార్(ఎఫ్‌ఏసీ)గా డిప్యూటీ తహసీల్దార్ శివకృష్ణను నియమించారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న సారంగపాణి బదిలీపై విడవలూరుకు వెళ్లడంతో శివకృష్ణకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో సైతం శివకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరించిన అనుభవం ఉంది.

వినతుల స్వీకరణ

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి తహసీల్దార్ శివకృష్ణ సోమవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రధానంగా పాసుపుస్తకాలు, భూ వివాదాలు, భూమి కొలతలు తదితర సమస్యలపై వినతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి అభినందనల వెల్లువ



పొదలకూరు : కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు



తోటపల్లిగూడూరు : కాకాణికి గజమాలతో సత్కారం

పొదలకూరు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మండలంలోని మహ్మదాపురానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కాకాణిని కలిసి అభినందించారు. ఈ మేరకు నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి మీ నాయకత్వంలో పార్టీ పూర్వవైభవం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సుబ్బరాయుడు, ఉపసర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, పి.అశోక్‌కుమార్‌రెడ్డి, బొడ్డు మాల్యాద్రిరెడ్డి, గడ్డం తిరుపాల్‌రెడ్డి, నూలి వెంకటేశ్వర్‌రెడ్డి, కండ్లకూటి రమణారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తోటపల్లిగూడూరు మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి శంకరయ్యగౌడ్ సోమవారం రాత్రి నెల్లూరులోని కాకాణి నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. అలాగే గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పల అమర్, గోడా కిశోర్, కోడూరు శేషు, ఉప్పల చరణ్, వరకవిపూడి, అనంతపురం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలిముద్ర పడితేనే ఎంట్రీ

- జొన్నవాడలో విచిత్ర పరిస్థితి
- అన్నదానం కోసం వేచి ఉండాల్సిందే
- ఆవేదన చెందుతున్న భక్తులు



జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. రాష్ట్రం, జిల్లా నలుమూలల నుంచి నిత్యం భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు. అన్నదానం స్వీకరిస్తుంటారు. తాజాగా అన్నప్రసాదం స్వీకరించాలంటే వేలిముద్ర వేయాలనే నిబంధనను ఆలయ అధికారులు అమలు చేస్తున్నారు. దీంతో వేలిముద్రలు పడని భక్తుల విషయంలో అన్నదాన సత్రంలోకి వెళ్లాలంటే ఆలస్యమవుతోంది. క్యూలైనులో ముందు వచ్చిన భక్తులకు వేలిముద్ర పడకపోతే వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సిబ్బంది రెండు మూడు సార్లు ప్రయత్నించిన తర్వాత వేలిముద్రలు పడకపోతే ఆలస్యంగా లోపలకు అనుమతిస్తున్నారు. దీంతో వృద్ధులు, వేలిముద్రలు పడని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్లలో ముందు ఉన్నా వేలిముద్రలు పడటం లేదనే కారణంతో తమను ఆలస్యంగా అన్నదానానికి అనుమతించడం సరైన పద్ధతి కాదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డిని సోమవారం సాక్షి వివరణ కోరగా రాష్ట్రంలో అన్ని ప్రముఖ ఆలయాల్లో ఈ విధానం అమలు చేస్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశం మేరకే కామాక్షితాయి ఆలయంలో కూడా ఇదే విధానం అమలు చేస్తున్నామని వివరించారు. వేలిముద్రలు పడని భక్తులను కూడా అన్నప్రసాదం పొందేందుకు అనుమతిస్తున్నామని ఆయన వివరించారు.

పోషకాహారంపై అవగాహన అవసరం



గర్భిణులు, బాలింతలకు అవగాహన

కొడవలూరు : గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారంపై అవగాహన అవసరమని మహిళా పోలీస్ వై.సురేఖ సూచించారు. మండలంలోని రామాపురం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలున్న ఆకుకూరలు, పాలు, చిరు ధాన్యాలు, గుడ్లు తీసుకోవడం ద్వారా పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. ఏఎన్‌ఎం వై.సుమతి మాట్లాడుతూ పోషకాహార లోపం తలెత్తితే రక్తహీనతకు దారి తీస్తుందని చెప్పారు. రక్తహీనత వల్ల గర్భిణులకు కాన్పు కష్టతరంగా మారుతుందన్నారు. బాలింతలైతే బిడ్డకు ఆరోగ్యకర పాలనందించలేని పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంక్షేమ సహాయకురాలు టి.శ్రావణి, ఇంజినీరింగ్ సహాయకురాలు బి.నాగదివ్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.